క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన

రాజోలు: సమాచార హక్కు చట్టంపై రైతులకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాట్రేనిపాడులో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ సమాచార హక్కు చట్టం ద్వారా రైతులు ఎలాంటి, ఎటువంటి సమాచారాన్ని పొందవచ్చనే అంశాలతో దరఖాస్తు చేసే విధానాన్ని, ఉపయోగాలను వివరించారు. రూ.10 డిమాండ్ డ్రాఫ్ట్, పోస్టల్ ఆర్డర్‌ను దరఖాస్తుకు జత చేయాలన్నారు. వీఏఏ సాయి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వీల్‌చైర్స్ అందజేత



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి వీల్ చైర్స్ అందజేస్తున్న ఎస్‌బీఐ బీఎం స్వామి

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి సేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్థానిక బ్రాంచ్ ద్వారా ఐదు వీల్ చైర్స్ అందజేశారు. ఎస్‌బీఐ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రి వారి విజ్ఞప్తి మేరకు వీల్ చైర్స్ అందించారు. ఆస్పత్రి వైద్యాధికారి జి.దుర్గాప్రసాద్ ఎస్‌బీఐ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బీఎం రెడ్డి స్వామిశివ, డాక్టర్ మోర్త వంశీ, మనోహర్, సిబ్బంది రవి, ప్రసాద్, నాయుడు, గనిరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రావులమ్మ పంట జాతర

అంబాజీపేట: కె.పెదపూడి గ్రామంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి పంటజాతర మంగళవారం వైభవంగా జరిగింది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ పంటజాతరలో రైతులు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారు పూజాఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకొన్నాయి. అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు చెల్లించారు. పంట దిగుబడులు పెరగాలని అమ్మవారిని కోరుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ

మలికిపురం: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆహార ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని ప్రకృతి వ్యవసాయ మలికిపురం యూనిట్ ఇన్‌చార్జి బుంగ కిరణ్ చిట్టి స్వరాజ్ రాకేష్ పేర్కొన్నారు. మంగళవారం మలికిపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేశారు. సిబ్బంది ఆకుకూరలు, కూరగాయలను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో రసాయన పదార్థాల వాడకం వల్ల అనర్థాలు సంభవిస్తున్నాయని అవగాహన కల్పించారు. స్వర్ణకుమారి, సూర్యకుమారి, మౌనిక, హరిబాబు, ప్రశాంతి, ప్రసాద్, రవికాంత్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన దొడ్డపనేని భారతి వారి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.20,100 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతకు అర్చకులు ఆశీర్వచనం అందజేసి, స్వామి శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

ఇన్వర్టర్, ప్రింటర్ బహూకరణ



పి.గన్నవరం హైస్కూల్‌కు ఇన్వర్టర్, ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు బోడపాటివారిపాలెం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు చినమిల్లి నాగ వెంకటరామకృష్ణ, కొండయ్య నాయుడు మంగళవారం ఇన్వర్టర్, ప్రింటర్‌ను వితరణ చేశారు. సుమారు రూ.50 వేలతో వీటిని కొనుగోలు చేశారు. చినమిల్లి సోదరులను హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ సాధనాల దుర్గారావు పాల్గొన్నారు.

రెండు బెల్ట్ షాపులపై దాడి

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో రెండు బెల్ట్ షాపులపై దాడులు చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. మంగళవారం రాత్రి సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరగకుండా అరికట్టడంలో భాగంగా నిర్వహించిన దాడుల్లో ఆత్రేయపురం మండలం ర్యాలిలో ఒక బెల్ట్ షాపును గుర్తించి 10 క్వార్టర్ (180 ఎంఎల్) మద్యం బాటిళ్లతో కప్పల వంశీవర్మను, రావులపాలెం మండలం దేవరపల్లిలో 8 క్వార్టర్ (180 ఎంఎల్) మద్యం బాటిళ్లతో వాసంశెట్టి రాజేష్, జి.నాగేంద్రలను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.



శిథిల స్థితిలో ఉన్న శంకరగుప్తం-బట్టేలంక వంతెన కింది భాగం

బట్టేలంక వంతెనకు మోక్షమెప్పుడో..!

- ప్రమాదకరంగా రాకపోకలు
- శంకరగుప్తం-బట్టేలంక రోడ్డుకూ తప్పని దుస్థితి

మలికిపురం: అది శంకరగుప్తం-బట్టేలంక శిథిల వంతెన. శంకరగుప్తం మేజర్ డ్రైన్‌పై ఉంది. సుమారు 48 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగి 20 ఏళ్ల క్రితం శిథిల స్థితికి చేరుకుంది. పదేళ్ల క్రితమే ప్రయాణాలకు అనుకూలంగా లేదని ఇంజినీరింగ్ నిపుణులు కూడా తేల్చిన ఈ వంతెన పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఎనిమిదేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. ఈ వంతెనతో పాటు, వంతెన పరిధిలోని లక్కవరం-బట్టేలంక, శంకరగుప్తం రోడ్డును కూడా ఏకకాలంలో నిర్మించేందుకు రూ.7.50 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం కోసం సుమారు రెండేళ్లుగా సాగిన ఈ ప్రయత్నాలు ఫలించి నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. 1970లో అప్పటి సమితి అధ్యక్షుడు మంగెన వేణుగోపాలం హయాంలో నిర్మించిన ఈ వంతెన విశేష సేవలందించింది. శంకరగుప్తం, పడమటిపాలెం, చింతలమోరి గ్రామాల ప్రజలు బయట ప్రపంచంలోకి రావడానికి ఈ వంతెన చాలా అవసరం. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిత్యావసరాల రవాణా, విద్యార్థుల, వ్యాపారుల ప్రయాణం నిత్యం ఈ వంతెన పైనే. అలాగే బట్టేలంక, లక్కవరం, కత్తిమండ, అడవిపాలెం, గుబ్బలపాలెం, ఇరుసుమండ తదితర గ్రామాల ప్రజలు కూడా రాకపోకలకు ఈ వంతెన అవసరం. అయితే శిథిల స్థితికి చేరిన ఈ వంతెన పునర్నిర్మాణం, ఈ వంతెన పరిధిలో రోడ్డు అభివృద్ధిపై పాలకులు, అధికారులు గత పదేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. గత పదేళ్లుగా ఈ వంతెన పరిధిలోని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వివిధ పార్టీల ప్రతినిధులు ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు.



నిధులున్నా పనులు మొదలు కాని శంకరగుప్తం ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

వెంటనే పనులు చేపట్టాలి

నిధుల విడుదల అనంతరం జాప్యం చేయకుండా వెంటనే పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం శిథిలస్థితిలో ఉన్న వంతెన ఏ క్షణాన్నయినా కూలుతుందని ఇంజినీర్లు సూచించిన నేపథ్యంలో భారీ వాహనాలు ఈ వంతెనపై వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇంజినీర్ల సూచనలకు విరుద్ధంగా ప్రస్తుత శిథిల వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల బస్సులతో పాటు, ఆర్టీసీ బస్సులు, సరుగుడు, కొబ్బరి, పీచు రవాణా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి.

ప్రమాదకరంగా వంతెన



శంకరగుప్తం-బట్టేలంక శిథిల వంతెన రోడ్డు నిర్మాణాలకు గతంలోనే రూ.7.50 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కేవలం వంతెన కోసం రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. పనులు ప్రారంభం కాలేదు. వెంటనే పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలి. అప్పటి వరకూ భారీ వాహనాల రాకపోకలు అరికట్టాలి.

– మానుకొండ ప్రమీల, ఎంపీటీసీ, శంకరగుప్తం

పనుల ప్రారంభానికి కృషి



శంకరగుప్తం శిథిల వంతెన నిర్మాణంతో పాటు, రోడ్డు కూడా నిర్మించేందుకు గతంలో ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.7.50 కోట్లు మంజూరయ్యాయి. ఆ మంజూరు ఉత్తర్వుల జీఓ రద్దు కాకుండా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

– గుండుబోగుల పెదకాపు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్

బాణసంచా సామగ్రి స్వాధీనం

అలమూరు: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని చెముడులంకలో అక్రమంగా తయారు చేస్తున్న మందుగుండు (బాణసంచా) సామగ్రి స్వాధీనం జరిగింది. ఆలమూరు పోలీసుల కథనం ప్రకారం స్థానిక శ్రీరామాలయం వద్ద అక్రమంగా మందుగుండు సామగ్రిని తయారు చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితుడు కె.సత్యనారాయణ నుంచి 25 తారాజువ్వలు, రెండు కేజీల సిసింద్రీ మందు, కేజీ పటాస్ మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌ఓ డి.సూర్యచంద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.35 వేల విలువైన సరకు సీజ్

మామిడికుదురు: నగరం గ్రామంలోని మొల్లేటి వారిమెరక ఈదరాడ కాలువ గట్టు రోడ్డులో మొల్లేటి మోహన్ సతీష్ ఇంట్లో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోకుండా నిల్వ చేసిన బాణసంచాను సీజ్ చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి రూ.35 వేలు విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనధికారికంగా బాణసంచా విక్రయించినా, నిల్వ చేసినా అటువంటి వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఉయ్యూరి వారి మెరకలో..

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక గ్రామంలో మంగళవారం అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన దీపావళి మందుగుండును విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.93,690 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.

సీహెచ్‌ఓ వెంకటరత్నంకు సత్కారం



పెదపళ్లలో ఉద్యోగ విరమణ చేసిన వెంకటరత్నంను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

అలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో సుదీర్ఘ కాలం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పి.వెంకటరత్నంకు మంగళవారం సత్కారం జరిగింది. పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 35 ఏళ్ల పాటు పలు హోదాల్లో అంకిత భావంతో విధులు నిర్వహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్న సీహెచ్‌ఓ సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం దుశ్శాలువా కప్పి పూలమాలలు వేసి మెమెంటో బహూకరించి ఘనంగా సత్కరించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎన్.సత్యకుమార్, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏవీవీ రాజా అక్కుల, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, వి.రమణ, వి.సుబ్బారావు, ఎస్.సురేష్, డి.సుగుణలక్ష్మి, ఆర్.రాజారమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభ

అలమూరు: మండలంలోని బడుగువానిలంకలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక రైతుల నుంచి స్వీకరించిన 42 దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండల రెవెన్యూ అధికారి ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ఎం.ప్రభావతి, గ్రామ కార్యదర్శి జె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసన్



రావులపాలెం: స్థానిక రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌గా జి.శ్రీనివాసన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ అంబాజీపేట మండలం నుంచి బదిలీపై ఆయన రావులపాలెం వచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



పోలీసు రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ

రాజోలు: రక్తదానం చేయడంతో ప్రాణదానం చేసినట్టేనని రాజోలు సీఐ నరేష్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజోలు ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ నరేష్‌కుమార్ ప్రారంభించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలు నిలపవచ్చన్నారు. కొన్ని సందర్భాల్లో రక్తం లభించక పోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు రాజేష్‌కుమార్, పీవీవీఎస్‌ఎన్ సురేష్, కె.దుర్గాశ్రీనివాసరావు, జనసేన నాయకుడు కోళ్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

వేపచెట్టు డ్రైన్‌పై వంతెనకు ప్రతిపాదనలు ఇవ్వండి

మలికిపురం: మలికిపురం-మూలపొడు మధ్య వేపచెట్టు మీడియం డ్రైన్‌పై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ఇవ్వాలని డ్రైనేజీ శాఖ డీఈ నాగార్జునరావుకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన డ్రైన్ పనితీరు, ఈ డ్రైన్‌పై పలు చోట్ల శిథిల స్థితిలో ఉన్న వంతెనలను పరిశీలించారు. సత్యజ్యోతి థియేటర్, మూలపొడు వంతెనలు పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో మూలపొడు వంతెన తొలుత నిర్మాణం చేద్దామని సూచించారు. అలాగే మూలపొడు వంతెన సమీపాన ఉన్న జగనన్న కాలనీని కూడా ఎమ్మెల్యే దేవ పరిశీలించారు. ఇక్కడ రోడ్లు, తాగునీటి వసతులు కల్పిస్తే నివాసాలు ఏర్పాటు చేసుకుంటామని లబ్ధిదారులు ఎమ్మెల్యేను కోరగా పంచాయతీ అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, గెద్దం తులసీ భాస్కరరావు, తిరుమల ఏసుబాబు, గవర్రాజు తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో అమలాపురం ఎల్‌సీఎంఐ కేర్ సౌజన్యంతో కంప్యూటర్ ఆధారిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ప్రారంభించారు. ఎల్‌సీఎంఐ కేర్ టెక్నీషియన్స్ నగేష్, నిర్మల, కుమారి కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో పలువురికి కంటి చూపులో లోపాలు, పలు రుగ్మతలు గుర్తించి, వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. అవసరం మేరకు ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ ఇచ్చారు.

రన్నింగ్‌లో జాతీయ స్థాయికి విద్యార్థి ఎంపిక

రావులపాలెం: అథ్లెటిక్స్ 6 కేఎం రన్నింగ్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థి అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణ మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెంకటప్రదీప్ ఇటీవల కర్నూల్‌లో జరిగిన అండర్-19 స్టేట్‌మీట్‌లో 6 కేఎం రన్నింగ్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు. అలాగే 3 కేఎం రన్నింగ్‌లో తృతీయస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించాడన్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో 6 కేఎం విభాగానికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి కళాశాల చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, సెక్రటరీ నరేష్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణం

మామిడికుదురు: 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తున్నామని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. లూటుకుర్రు గ్రామ పరిధిలోని బాడిలంకలో పోశమ్మ ఆలయం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. సుదీర్ఘంగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను తీర్చిదిద్దే విధంగా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వానరాశి సూరిబాబు, విప్పర్తి రాజ్‌కుమార్, అప్పన వెంకటేశ్వరరావు, స్థానికులు విళ్ల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవిడి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పద్మలత

కొత్తపేట: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అవిడి, వాడపాలెం గ్రామాల్లో ఏఓ పద్మలత ఆధ్వర్యంలో రైతుల అవగాహన సదస్సులు, క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పంటల బీమా కింద వరి పంటకు సంబంధించి ఎకరానికి రూ.630 చెల్లించి తమ పంటకు బీమా చేసుకోవాలని తెలియజేశారు. ఈ ప్రీమియం చెల్లించుటకు డిసెంబర్ 31 ఆఖరు తేదీగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అవిడి గ్రామ క్షేత్ర సందర్శన సందర్భంగా వరిలో ఆకుముడత, తాటాకు తెగులు ఉన్నట్లు గుర్తించారు. అవి వ్యాపించడానికి అనుకూల పరిస్థితులు, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి రైతులకు వివరించారు. అలాగే జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్) కింద ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ రిజోర్స్ పర్సన్ (సీఆర్‌పీ), ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ (పీఆర్‌పీ)ల ఆధ్వర్యంలో తూటికాడ కషాయం తయారు చేసే పద్ధతి, దానివల్ల ప్రయోజనాలు, వరిలో దోమపై కషాయం ప్రభావం గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. వరి, కంది, వంగ, మినప, కాలీఫ్లవర్, క్యాబేజీ పంటలలో ఆశించే దోమను అరికట్టడానికి ఉపయోగించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వరిపై ఆకు ఎండు తెగులు, సుడి దోమ ఆశిస్తుందన్నారు. దీని నివారణకు రైతులు చర్యలు తీసుకుని పురుగుల మందులు అతిగా పిచికారీ చేయవద్దన్నారు. ఉద్యానశాఖ ఏఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొబ్బరి మొక్కలు, చెట్లు పిడుగుపాటు, తెగుళ్ల వల్ల చనిపోతే ఆ చెట్లను తొలగించాలన్నారు. వాటి స్థానే కొత్త మొక్కలు వేసుకునేందుకు రాయితీలు ఇస్తున్నామన్నారు. ప్యాక్‌హౌస్ కొబ్బరి నిల్వ చేసుకోవడానికి సుమారుగా రూ.2 లక్షల వరకు రాయితీ వస్తుందన్నారు. కూరపాదులు, పందిరి ఏర్పాటుకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు ఎం.ప్రియాంక, వైడీ భీమారావు, రైతులు ఎంఎం శెట్టి, సీవీ సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు వరిసాగు రైతులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందే విధానాల గురించి ఏవో పీవీ నరసింహారావు రైతులకు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వెటర్నరీ, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నదీపాయలో తాత్కాలిక రహదారి ఏర్పాటు



బూరుగులంక రేవులో నిర్మించిన తాత్కాలిక రహదారి

పి.గన్నవరం: వరద నీరు తగ్గడంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం వశిష్ట నదీపాయలో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. ఊడిమూడిలంక వంతెనను నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థ అధినేత పీపీ రాజు సాయంతో నాలుగు రోజులుగా జేసీబీతో ఈ రహదారిని ఏర్పాటు చేశారు. నదీపాయలో ఏర్పాటు చేసే తాత్కాలిక రహదారి ఏటా వరదలకు కొట్టుకుపోతుంది. అప్పటి నుంచి పడవలపై వెళ్తుంటారు. వరదలు తగ్గిన తర్వాత మళ్లీ రహదారిని నిర్మించుకుంటారు. ఈ లంక గ్రామాల ప్రజల కోసం నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.49.5 కోట్లతో ఇక్కడ వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు.

కరవాక వంతెన నిర్మాణానికి కార్యాచరణ



కరవాకలో శంకరగుప్తం డ్రైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: కరవాక-గోగన్నమఠం గ్రామాల మధ్య శంకరగుప్తం డ్రైన్‌పై వంతెన నిర్మాణానికి కార్యాచరణ చేపడతానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కరవాక గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. డ్రైన్ వద్ద కరవాక రేవును పరిశీలించారు. అక్కడ పరిస్థితులపై స్థానికులతో మాట్లాడారు. గతంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, పలువురు ఎమ్మెల్యేలు పలుమార్లు శంకుస్థాపనలు సైతం చేశారని స్థానికులు తెలిపారు. కానీ వంతెన నిర్మాణం మాత్రం సాకారం కాలేదన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో సమీక్ష చేసి వంతెన నిర్మాణం ద్వారా కరవాక ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తొలగించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో డ్రైన్స్ డీఈ నాగార్జున, ఏడీ శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, అల్లు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై విద్యార్థులకు అవగాహన

అయినవిల్లి: ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యానవన పంటలపై ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అంబాజీపేట వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి విధానాలు చేపట్టి వ్యవసాయాన్ని కాపాడుకోవాలన్నారు. అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రైనీ కుమారి, ఎల్.కమలప్రియ సారథ్యంలో అంబాజీపేట వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. కొబ్బరి, కోకో పంటల పెంపకం, మొక్కలు పెరగడానికి ఎలాంటి వాతావరణం, ఎలాంటి సేంద్రియ ఎరువులు వాడాలి, మిత్ర పురుగుల పెంపకం వంటి అంశాలపై వివిధ పద్ధతులను విశదీకరించారు. విద్యార్థులు తమకున్న సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేత



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన అడబాల రాజారావు-నాగకృష్ణ కుమారి దంపతులు రూ.51,111 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో సూపరింటెండెంట్ విజయ సారథికి పై మొత్తాన్ని ఇచ్చి, స్వామి చిత్రపటం, ప్రసాదాలను దాత అందుకున్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం



చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.12 వేలను చెక్కు రూపంలో సాయంగా అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన రాయుడు అఖిల్(9)కి బ్రెయిన్ ఇన్ఫెక్షన్ వచ్చి శరీరంలో ఏ అవయవం పని చేయకపోవడంతో వైజాగ్ హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికి రూ.7 లక్షల వరకు ఖర్చయింది. ఇంకా చికిత్స చేయించాల్సి ఉంది. అంత ఆర్థికస్తోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో అఖిల్ నానమ్మ మంగకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కును అందజేశారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్

మలికిపురం: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా మలికిపురంలో జరుగుతున్న బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలికల టీమ్ ఈవెంట్స్‌లో అండర్-14 విభాగంలో కృష్ణా జిల్లా టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా నెల్లూరు టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో కూడా కృష్ణా జిల్లా నిలవగా అనంతపురం ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-14 బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి టీం ప్రథమ స్థానంలో నిలవగా విశాఖపట్నం టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలు విభాగంలో తూర్పుగోదావరి టీం ప్రథమస్థానంలో నిలవగా విశాఖపట్నం టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.